# ర్యాంకు గ్యారెంటీ అంటే జైలుకే!

- కోచింగ్ కేంద్రాలకు కేంద్రం ముకుతాడు
- తప్పుడు ప్రకటనలిస్తే సుమోటోగా కేసులు
- మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్న కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీ

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): మోసపూరిత ప్రకటనలతో విద్యార్థులను చేర్చుకునే కోచింగ్ కేంద్రాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం సిద్ధమైంది. తప్పుడు ర్యాంకులు, ప్రకటనలతో మోసపుచ్చడం, బ్రాండింగ్ చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడే కోచింగ్ సెంటర్లపై చర్యలకు కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) కట్టుదిట్టమైన మార్గదర్శకాలు రూపొందిస్తున్నది. ఇందుకోసం నియమించిన కమిటీ ఈ నెల 8న తొలిసారి సమావేశమై ముసాయిదా మార్గదర్శకాలపై సమగ్రంగా చర్చించింది. వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్‌సింగ్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్, కేంద్ర విద్యాశాఖ, నేషనల్ లా యూనివర్సిటీ, ఫిట్జి, ఖాన్ గ్లోబల్ స్టడీస్, లాల్ బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. వందశాతం గ్యారెంటీ వంటి ప్రకటనలకు ఇక ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందేనని, లేదంటే అలాంటి ప్రకటనలు ఇచ్చే కోచింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇటీవల ఇలాంటి ప్రకటనలు ఇచ్చిన 31 కోచింగ్ ఇనిస్టిట్యూట్లపై సీసీపీఏ సుమోటోగా కేసులు నమోదు చేసింది. మరో 9 సంస్థలకు జరిమానా విధించింది.

### మార్గదర్శకాలిలా

- వినియోగదారుల రక్షణ చట్టం-2019 ప్రకారం తప్పుదోవ పట్టించే ప్రకటనలు జారీచేయరాదు.
- ఆన్‌లైన్, ఫిజికల్ కోచింగ్‌నిచ్చే అన్ని సంస్థలు వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలోకి వస్తాయి.
- తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలన్న తేడాల్లేకుండా అన్ని రకాల ప్రకటనలను సీసీపీఏ పరిశీలించి నియంత్రిస్తుంది.
- కోచింగ్ కేంద్రాలు ర్యాంకు సాధించిన అభ్యర్థి ఫొటోతో పాటు, మొత్తం సమాచారాన్ని పేర్కొనాలి.
- ర్యాంకు, కోర్సుపేరు, కోర్సు వ్యవధి, ఉచిత శిక్షణా? ఫీజులు వసూలు చేశారా? వంటి వివరాలను సైతంవెల్లడించాలి.
- వందశాతం గ్యారెంటీ అని ప్రకటించకూడదు. ప్రిలిమ్స్ అయినా, మెయిన్స్ అయినా ఈ నిబంధన వర్తిస్తుంది.
- ప్రకటనలోని కంటెంట్ అంతా ఒకే సైజులో ఉండాలి.

### ఇప్పటికే ఇంటర్‌లో పర్యవేక్షణ కమిటీ

తెలంగాణలో తప్పుడు ప్రకటనలిచ్చే కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలకు ముకుతాడువేసేందుకు ఇంటర్‌బోర్డు నిరుడు పటిష్ట చర్యలు చేపట్టింది. కాలేజీలిచ్చే అడ్వర్టయిజ్‌మెంట్ల పరిశీలనకు ప్రత్యేకంగా పర్యవేక్షణ కమిటీని నియమించింది. జేఈఈ, నీట్ వంటి పరీక్షల్లో ర్యాంక్ సాధించిన ఒకే విద్యార్థి తమ వాడంటూ రెండు, మూడు విద్యాసంస్థలు ప్రకటనలిచ్చుకుంటున్నాయి. క్యాటగిరీ ర్యాంకులను ఓపెన్ ర్యాంకులుగా ప్రచారం చేసుకుంటున్నాయి. దీనిపై ఫిర్యాదులందడంతో ఈ విభాగాన్ని ఏర్పాటు చేసి, పటిష్ట నిబంధనలు పొందుపరిచారు. కాలేజీలు పత్రికలకు ప్రకటనలు ఇవ్వాలనుకుంటే ఇంటర్‌బోర్డు నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రచురించడానికి ముందే ఆయా ప్రకటనలను కాలేజీలు బోర్డుకు సమర్పించాలి. కమిటీ అందులోని కంటెంట్‌ను పరిశీలించిన తర్వాతే ప్రచురణకు ముందస్తు అనుమతినిస్తుంది.

# ఆధిపత్య పోరులో ఎక్సైజ్ సంఘాలు

- మళ్లీ తెర పైకి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ యూనియన్
- నిబంధనలకు విరుద్ధంగా 'జీరో ట్రాన్స్‌ఫర్స్'కు వినతి
- పాతపద్ధతి పాటించాలంటున్న గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్
- ఫోకల్, నాన్ ఫోకల్ పోస్టులపై ముదురుతున్న వివాదం

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు రాజకీయ రంగు పులుముకుంటున్నది. రెండు ఉద్యోగ సంఘాల ఆధిపత్య పోరులో ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రభావం ఎక్సైజ్‌శాఖ ఆదాయంపై పడుతుందేమోనని పలువురు ఉన్నతాధికారులు ఆందోళన చెందుతున్నారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగులను కొన్నేండ్లుగా రెండు ఉద్యోగ సంఘాలు నడిపిస్తున్నాయి. అందులో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో అనుబంధ) ఒకటి కాగా, రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మరొకటి. అయితే రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కొంతకాలంగా క్రియాశీలకంగా లేని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధిపత్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నది. ఉద్యోగ బదిలీలను 'జీరో ట్రాన్స్‌ఫర్ల' పేరుతో చేపట్టాలని ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేస్తున్నది. నాడు ఫోకల్ పోస్టుల్లో అక్రమంగా సంపాదించి, నేడు నాన్‌ఫోకల్ పోస్టుల్లో ఉన్న రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులే ఇలా వినతులు ఇస్తున్నారని టీజీవో అనుబంధ సంఘం ఆరోపిస్తున్నది.


### స్వరాష్ట్రం కోసం కొట్లాడిన వారే టార్గెట్

ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడని తమ సంఘంలోని ఉద్యోగులను ఇబ్బంది పెట్టేందుకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రయత్నిస్తున్నదని గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆరోపిస్తున్నది. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా బైలా నిబంధనలను ఉల్లంఘిస్తూ ఒక ఎస్సై స్థాయి అధికారిని నియమించారని టీజీవో నాయకులు చెప్తున్నారు. ఈ కొత్త యూనియన్‌ను ముందుండి నడిపిస్తున్న ఆ అధికారి 317 జీవో ప్రకారం మల్టీ జోన్-1లో విధులు నిర్వర్తించాల్సి ఉండగా, పైరవీలు చేస్తూ హైదరాబాద్‌లో అడుగుపెట్టేందుకు ఇతర నాయకులను బలి చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. కొన్నేండ్లుగా ఫోకల్ పోస్టుల్లో తిష్ట వేసిన కొందరు అధికారులను గత ప్రభుత్వం నాన్ ఫోకల్ పోస్టుల్లో నియమించిందని, దీనితో కక్ష గట్టిన ఆ సంఘం నేతలు ప్రభుత్వం మారిన వెంటనే తమ సంఘంలో ఉన్న ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని టీజీవో అనుబంధ సంఘం ఆరోపిస్తున్నది. ఉద్యోగుల సమస్యలపై ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇన్నిరోజులు ఎందుకు మాట్లాడలేదో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.

### ఫోకల్‌లోకి వచ్చేందుకే 'జీరో ట్రాన్స్‌ఫర్స్'

ఒక ఉద్యోగి చాలా ఏండ్లుగా ఫోకల్ పాయింట్‌లో పనిచేస్తే ఆ ఉద్యోగిని అనంతరం నాన్ ఫోకల్ పాయింట్‌కు మారుస్తారు. గత ఎన్నికలకు ముందు 5 నుంచి 6 ఏండ్లపాటు ఫోకల్ పాయింట్‌లో పనిచేసిన ఉద్యోగులను నాన్ ఫోకల్ పాయింట్‌లోకి మార్చారు. దీంతో వారిలో కొందరు పనిగట్టుకొని ప్రస్తుతం ఫోకల్ పాయింట్‌లో పనిచేసే వారిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, పనిగట్టుకొని ఫిర్యాదులు చేయిస్తున్నారని టీజీవో అనుబంధ సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. బదిలీలకు ఎలాంటి టైమ్ పిరియడ్ లేకుండా 'జీరో ట్రాన్స్‌ఫర్లు' చేయాలని ఉన్నతాధికారులకు, ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలు ఇస్తున్నారని మండిపడుతున్నారు.

### టీఎస్ఐఐసీ ఎండీగా విష్ణువర్ధన్‌రెడ్డికి బాధ్యతలు



హైదరాబాద్, జనవరి 13(నమస్తే తెలంగాణ): రాష్ట్ర పెట్టుబడుల ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి ఈ విష్ణువర్ధన్‌రెడ్డికి టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల ఐఏఎస్ అధికారుల బదిలీల సందర్భంగా టీఎస్ఐఐసీ వీసీ, ఎండీ నర్సింహారెడ్డిని గిరిజన సంక్షేమ శాఖకు బదిలీచేసి ఈ శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం విధితమే. తాజాగా శ్రీధర్ స్థానంలో విష్ణువర్ధన్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

### ఏపీ ఉపముఖ్యమంత్రిపై కేసు

సుల్తాన్‌బజార్, జనవరి 13: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామిపై కేసు నమోదైంది. బేగంబజార్ సీఐ నమిండ్ల శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానికి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ కారణమని నారాయణ స్వామి అనుచిత వ్యాఖ్యలు చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 504,505 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ వివరించారు.

### ప్రపంచంలోనే అతి పురాతన అడవి గుర్తింపు

న్యూఢిల్లీ, జనవరి 13: ఈ భూమిపై ప్రపంచంలోనే అతి పురాతన అడవిని పరిశోధకులు అమెరికాలో గుర్తించారు. న్యూయార్క్‌లోని కైరో నిర్జనమైన క్వారీ సమీపంలో దీన్ని వెలికితీసినట్టు పేర్కొన్నారు. అక్కడ సేకరించిన రాళ్లపై పరిశోధనల ఆధారంగా ఆ అడవి దాదాపు 38.5 కోట్ల సంవత్సరాల క్రితం నాటిదని ప్రాథమికంగా వెల్లడించారు. పురాతన అడవి ఉనికి పరిశోధక బృందానికి ఇంతకుముందు తెలిసినప్పటికీ, ఆ ప్రదేశంలో వృద్ధి చెందుతున్న మొక్కలు, చెట్ల వయసును గుర్తించేందుకు సమగ్ర పరిశోధనకు ఇది మొదటి ఉదాహరణ అని బీబీసీ పేర్కొన్నది. ఈ రాళ్లలో ఉన్న శిలాజ మూలాలు గతం గురించి పూర్తి అవగాహనను కల్పిస్తాయని, ఇది దాదాపు 400 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న పురాతన అడవిని సూచిస్తాయని పరిశోధకులు తెలిపారు.

# ములుగు జిల్లాలో పాత రాతియుగం గొడ్డలి

- 30 లక్షల ఏండ్ల కిందటిది వెలుగులోకి..
- గుర్తించిన పరిశోధకుడు జనార్దనాచారి





హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): పాత రాతియుగం నాటి రాతిగొడ్డలి ములుగు జిల్లాలో బయల్పడింది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుర్రేవుల- భూపతిపురం గ్రామాల మధ్య గల వాగులో ఈ రాతిగొడ్డలి దొరికింది. ఔత్సాహిక పరిశోధకుడు ఏలేశ్వరం జనార్దనాచారి దీనిని గుర్తించి భద్రపరిచారు. 15.5 సెంటీమీటర్ల పొడవు, 11 సెంటీమీటర్ల వెడల్పు, 5.5 సెంటీమీటర్ల మందం గల ఈ గొడ్డలిని పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్.. ఇది పాతరాతియుగానికి చెందినదిగా పేర్కొన్నారు. ద్విపార్శ్వముఖ, ద్వికుంభాకార చేతిగొడ్డలిగా పురాతన మానవులు రాతి పనిముట్టుగా ఈ గొడ్డలిని వాడుకున్నారని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ప్రాక్చరిత్రకారుడు రవి కొరిసెట్టర్ (కర్ణాటక) ఈ గొడ్డలి 30 లక్షల ఏండ్ల కిందటిదిగా, పాత రాతియుగం తొలిదశకు చెందినదిగా విశ్లేషించారు.

# వర్గీకరణ పూర్తయ్యేవరకు ఉద్యోగాల భర్తీ వద్దు

- ఎస్సీ రిజర్వేషన్ల అంశం కీలకదశలో ఉంది
- వర్గీకరణను సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేయాలి: మందకృష్ణ మాదిగ డిమాండ్



ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 13: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కీలక దశకు చేరుకున్న ప్రస్తుత తరుణంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా జరిగే ఉద్యోగ భర్తీ ప్రక్రియను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ కీలక దశలో ఉన్నందున దానిని సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరారు. బౌద్ధనగర్ డివిజన్ పార్శిగుట్టలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణపై 17న సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం విచారణ జరపబోతున్నదని తెలిపారు. వర్గీకరణకు మద్దతుగా ప్రధాన ప్రతిపక్ష హోదాలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో కేంద్రానికి లేఖ రాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. చేవెళ్ల డిక్లరేషన్ ద్వారా మొదటి ప్రాధాన్యత అంశంగా ప్ర కటించిన వర్గీకరణకు కట్టుబడి ఉండాలని కోరారు. అన్ని నియామకాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు అవకాశం కల్పించాలని కోరారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులతో పాటు ఎమ్మెల్సీ పదవులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

# క్లైమేట్ చేంజ్‌తో.. కడుపులో బిడ్డపై ఎఫెక్ట్

- తక్కువ లేదా ఎక్కువ బరువుతో పుట్టే ఛాన్స్
- ఆస్ట్రేలియా శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి
- 20 % మంది పిల్లల్లో సమస్యలున్నట్టు వెల్లడి

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): వాతావరణ మార్పులు మనుషుల జీవన విధానంపైనే కాదు.. పుట్టుక మీద కూడా ప్రభావం చూపుతాయని తేలింది. వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రతల్లో కలిగే వ్యత్యాసాలతో కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని ఆస్ట్రేలియాకు చెందిన శాస్త్రవేత్తలు గుర్తించారు. కర్టిన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు సుమారు 3.85 లక్షల మంది గర్భిణులపై పరిశోధనలు చేశారు. 2000 నుంచి 2015 మధ్య ఈ పరిశోధన జరిగింది. గర్భందాల్చడానికి 12 వారాల నుంచి బిడ్డ పుట్టే వరకు తల్లి, బిడ్డ ఆరోగ్య పరిస్థితులను అధ్యయనం చేశారు. ఇలా పుట్టిన బిడ్డల్లో దాదాపు 20 శాతం మంది బరువుల్లో వ్యత్యాసం ఉన్నట్టు తేల్చారు.

పరిశోధన కాలంలో గర్భిణులు నివసించిన వాతావరణ పరిస్థితులు, సాధారణ ఉష్ణోగ్రతలతో పోల్చితే కలిగిన వ్యత్యాసం, వాటివల్ల వారిలో కలిగే మానసిక ఒత్తిడి (బయో థర్మల్ స్ట్రెస్) వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఇందుకోసం వారు ప్రపంచంలోనే మొదటిసారిగా 'యూనివర్సల్ థర్మల్ క్లైమేట్ ఇండెక్స్'ను (యూటీసీఐ) ఉపయోగించారు. వాతావరణ పరిస్థితులకు శరీరం స్పందించే తీరును ఈ సూచీలో లెక్కిస్తారు. వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రతల్లో కలిగే వ్యత్యాసాలను 'బయో క్లైమాటిక్ కండీషన్స్' అంటారు. గర్భంతో ఉన్న సమయంలో బయో క్లైమాటిక్ కండీషన్స్‌కు లోనైనప్పుడు కలిగే ప్రతిస్పందనలను యూటీసీఐ ఆధారంగా లెక్కించారు. ఈ క్రమంలో వడగాడ్పులు, శీతల పవనాలు, వరదలు, కరువు ఇతర ప్రకృతి విపత్తులు వంటి పరిస్థితులు ఉన్నాయి. పుట్టిన బిడ్డల బరువును గణించగా.. పుట్టిన బిడ్డల్లో సుమారు 20 శాతం మంది సాధారణ బరువు కన్నా అతి తక్కువగానో, ఎక్కువగానో పుట్టినట్టు వారు గుర్తించారు. మొత్తం పిల్లల్లో 9.8 శాతం మంది తక్కువ బరువుతోనూ, 9.9 శాతం మంది అధిక బరువుతో ఉన్నట్టు నిర్ధారించారు.

'పుట్టిన సమయంలో బిడ్డ బరువుకు, ఆరోగ్యానికి ఎంతో సంబంధం ఉంటుంది. నవజాత శిశుమరణాలు, బాల్యంలో అనారోగ్య సమస్యలు, పెద్దయ్యాక దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడటం వంటి అనేక సమస్యలు తలెత్తుతాయి' అని పరిశోధక బృంద సభ్యుడు డాక్టర్ సైల్వెస్టర్ డోజీ న్యాదను తెలిపారు. తీవ్ర వాతావరణ పరిస్థితుల మధ్య పిండం ఎదుగుదలలో లోపాలు తలెత్తుతాయని చెప్పారు.

# త్వరలో మరిన్ని యాంటీ డ్రగ్ కమిటీలు

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ సూచనల మేరకు యాంటీడ్రగ్ కమిటీల పెంపుపై 'నార్కోటిక్ బ్యూరో (టీఎస్ న్యాబ్)' దృష్టి సారించింది. ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఆఖరికి పీజీ చదువుకునే యువత కూడా డ్రగ్స్‌కు బానిసలవుతుండటంతో ఈ లింక్‌లను ఎప్పటికప్పుడు ఛేదించి అరికట్టేందుకు మరికొన్ని యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ కమిటీల కోసం కాలేజీల ఎంపికను చేపడుతున్నారు. గతంలో వేసిన కమిటీలు ఆశించిన ఫలితాలను అందించకపోవడంతో.. టీఎస్ న్యాబ్ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని 203 కాలేజీల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఇంటర్ నుంచి పీజీ వరకూ ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలు రెండు వేలకు పైనే ఉండటం.. డ్రగ్ కమిటీలు ఉన్న కాలేజీల సంఖ్య తక్కువగా ఉండటంతో మరికొన్ని కాలేజీల ఎంపిక జరుగుతున్నది. ఇప్పటికే గుర్తించిన హాట్‌స్పాట్‌ల ఆధారంగా.. వాటి పరిధిలో ఉన్న కాలేజీలను లక్ష్యంగా చేసుకున్నారు. రాష్ట్ర విద్యాశాఖ నుంచి అన్ని కాలేజీలకు యాంటీ డ్రగ్ కమిటీల ఏర్పాటుపై స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి.

# చురుకుగా ఆపరేషన్ స్మైల్

- తెలంగాణ వ్యాప్తంగా విస్తృత సోదాలు చేపట్టిన పోలీసులు
- హోటళ్లు, ఇటుకబట్టీలు, పరిశ్రమల జల్లెడ

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): తప్పిపోయిన పిల్లలను, బాలకార్మికులను, అక్రమ రవాణా చేయబడిన పిల్లలను వివిధ పనిప్రదేశాల్లో గుర్తించి, రక్షించడానికి ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం చురుకుగా సాగుతున్నది. ఈ నెల ప్రారంభం నుంచి 13వ తేదీ వరకు సుమారు 800 మంది చిన్నారులను బృందాలు రెస్క్యూ చేసినట్టు సమాచారం. ఏటా జనవరి 1 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ స్మైల్' నిర్వహిస్తారు. ప్రస్తుతం 120 పోలీసు బృందాలు (ఎస్సై, లేడీతో కలిపి నలుగురు కానిస్టేబుళ్లు) మహిళాశిశు సంక్షేమశాఖ అధికారులు, శిశు సంక్షేమ కమిటీలు, జిల్లాల బాలల సంరక్షణ యూనిట్లు, ఎన్జీవోల ప్రతినిధులు, లేబర్ ఆఫీసు, ఆరోగ్యశాఖ అధికారులు ఈ ఆపరేషన్ స్మైల్ బృందాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, దేవాలయాలు, ట్రాఫిక్ జంక్షన్లు, మెకానిక్ దుకాణాలు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణ ప్రాంతాలు, టీస్టాల్స్, ఫుట్‌పాత్‌ల్లో పిల్లలను గుర్తించి.. సాంకేతికత ద్వారా వారి వివరాలు తెలుసుకుంటారు. నిరుడు 2,955 మంది చిన్నారులను రక్షించారు. వారిలో 2,602 మందిని తల్లిదండ్రుల చెంతకు, మిగిలిన వారిని రెస్క్యూ హోమ్స్‌లో చేర్చారు. గత ఏడాది 394 కేసులు నమోదవ్వగా, ఈ ఏడాది ఇప్పటికే వందకుపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్టు ఉన్నతాధికారులు తెలిపారు.

### తెలంగాణ మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్‌గా సుబ్రమణ్య శాస్త్రి



హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తెలుగు మాసపత్రిక చీఫ్ ఎడిటర్‌గా కే సుబ్రమణ్య శాస్త్రిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.